

వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి

ప్రభుత్వ ఆస్పత్రులు, డిస్పెన్సరీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద పనిచేసే వైద్యులకు భద్రత కల్పించాలి. ఆస్పతి వద్ద పోలీస్/సెక్యూరిటీ ప్రొటెక్షన్ ఏర్పాటు చేస్తే వైద్య సిబ్బందికి రక్షణగా ఉంటుంది. అప్పుడే భయపడకుండా విధులు నిర్వహించగలం. కోల్‌కతా వైద్యురాలిని హత్య చేసిన వారిని వెంటనే శిక్షించాలి. తక్షణ చర్యలు చేపట్టినప్పుడే దోషులకు భయం ఉంటుంది. వైద్యులు, వైద్య సిబ్బంది నిర్భీతిగా పని చేయాలంటే తగిన రక్షణ ఉండాలి. – డాక్టర్ హలీమ పర్వీన్, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, బురుజుపేట



రక్షణ లేకపోతే ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది

దూర ప్రాంతాల నుంచి వచ్చి రేయింబవళ్లు సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి భద్రత అవసరం. రక్షణ లేకపోతే ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. ఒక్కొక్కసారి రోగితో వచ్చే బంధువులు కూడా దౌర్జన్యాలకు పాల్పడుతుంటారు. అటువంటి సంఘటనలు అరికట్టడానికి ఆస్పత్రుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల వద్ద పోలీస్ రక్షణ ఏర్పాటు చేస్తే వైద్య సిబ్బందికి తగిన రక్షణ ఉంటుంది.
– పి.వెంకటలక్ష్మి, స్టాఫ్‌నర్స్, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

మరీ ఇంత నిర్లక్ష్యమా?

- నేతాజీ వంతెనపై పచ్చదనం కనుమరుగు
- నిద్రావస్థలో జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం
- లక్షల వ్యయంతో తీర్చిదిద్దిన సుందరీకరణ అదృశ్యం
- అధికారులు స్పందించాలంటున్న ప్రజలు

గత ప్రభుత్వ హయాంలో కంచరపాలెం–జ్ఞానాపురం మార్గంలో గల నేతాజీ వంతెనను అద్భుతంగా తీర్చిదిద్దారు. పచ్చని మొక్కలు పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించారు. వంతెనపై రాత్రివేళ ప్రయాణించే వారి కోసం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఫుట్‌పాత్‌లకు అందంగా రంగులు వేసి చక్కగా అలంకరించారు. అయితే తర్వాత సరైన నిర్వహణ లేక పచ్చని మొక్కలు కనీసం నీళ్లు లేక ఎండిపోయాయి. రాత్రివేళ వెలుగులు విరజిమ్మిన విద్యుత్ దీపాలు స్తంభాలు శిథిలమై చీకట్లలోకి జారుకున్నాయి. ఫుట్‌పాత్‌లు రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేతాజీ వంతెనకు పూర్వవైభవం కల్పించాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.



నేతాజీ వంతెనపై ఎండిపోయిన మొక్కలు **నేడు**



గతంలో పచ్చదనంతో నేతాజీ వంతెన **నాడు**



విరిగిన విద్యుత్ స్తంభం



అధ్వానంగా నేతాజీ వంతెన ఫుట్‌పాత్

కంచరపాలెం: కంచరపాలెం–జ్ఞానాపురం మార్గంలో గల నేతాజీ ఫ్లైఓవర్‌పై పచ్చదనం కనుమరుగవుతోంది. గతంలో ఈ వంతెనను సుందరంగా తీర్చిదిద్దారు. ఫుట్‌పాత్‌లపై టైల్స్, రక్షణ గోడలకు రంగులు, విద్యుత్ లైట్లు, పచ్చదనం కోసం కుండీల్లో మొక్కలు ఏర్పాటు చేశారు. దీనికి కూతవేటు దూరంలోనే జోన్–5 జోనల్ కార్యాలయం ఉంది. నిత్యం అటుగా జోనల్ అధికారులు, సిబ్బంది ప్రయాణం చేస్తుంటారు. అయినప్పటికీ వారికి వంతెనపై ఎండిపోతున్న మొక్కలు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అందంగా, ఆహ్లాదంగా రూపుదిద్దుకున్న ఈ వంతెన నేడు నిర్లక్ష్యానికి గురై శిథిల దశకు చేరుకోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన పైనుంచి కంచరపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, పాదచారులు, స్థానికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వంతెనపై ఏర్పాటు చేసిన పచ్చని మొక్కలకు సక్రమంగా నీరందక ఎండిపోయాయి. పచ్చదనంపై జీవీఎంసీ హార్టికల్చర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యం వహించారు.

విద్యుత్ స్తంభాలదీ అదే పరిస్థితి..

ఇక్కడ విద్యుత్ స్తంభాల నిర్వహణ సరిగ్గా లేక రాత్రి సమయంలో చీకట్లు రాజ్యమేలుతున్నాయి. ఇటీవల తుపాను గాలులు, వర్షానికి వంతెనపై విరిగిన విద్యుత్ స్తంభాలు మూలకు చేరాయి. నేటికీ వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయలేదు. విరిగిన విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా కనిపిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధికి కృషి చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి పచ్చదనం పెంపొందించాలని, విద్యుత్ లైట్లు, స్తంభాల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మొక్కలు ఎండిపోతున్నాయి..



లక్షల వ్యయంతో వంతెనను సుందరీకరించారు. తర్వాత నిర్లక్ష్యం వహించడంతో వంతెనపై గల మొక్కలు ఎండిపోతున్నాయి. హార్టీకల్చర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మొక్కలకు నీరు పోసి సంరక్షిస్తే అవి చక్కగా ఎదుగుతాయి. అధికారులు స్పందించాలి. – బేతా రాజు, ద్విచక్ర వాహన చోదకుడు, కంచరపాలెం

పచ్చదనం పెంపొందించాలి



వంతెనపై పచ్చదనం కనుమరుగు అవుతోంది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి మూలకు చేరుతున్నాయి. రాత్రివేళల్లో అటుగా ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటోంది. కొన్నాళ్ల కిందట ఈ వంతెన పచ్చగా కళకళలాడేది. అధికారులు చొరవ తీసుకుని వంతెన అభివృద్ధికి కృషి చేయాలి. –పి.వేళాంగిణి, జ్ఞానాపురం

సమస్యల పరిష్కారానికి కృషి..



సమస్యలు మా దృష్టికి వచ్చాయి. జీవీఎంసీ హార్టీకల్చర్ అధికారులతో గ్రీనరీ గురించి మాట్లాడాం. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవాటిని వేసి, నిత్యం నీరు పోసేలా చర్యలు తీసుకున్నాం. విరిగిన విద్యుత్ స్తంభాల చోట కొత్తవి వేసేలా ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించాం.
– ఆర్.జి.వి.కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్–5, జ్ఞానాపురం.

క్లుప్తంగా

24వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి పూజలు బుధవారం 24వ రోజుకి చేరాయి. బుధవారం నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో మహాన్నదానం



అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, అధ్యక్షుడు సూరాడ అప్పారావు ప్రారంభించారు. ఇది మత సామరస్యానికి ప్రతీక అని, వివేకానంద సంస్థ ఏ సందర్భంలోనైనా నిత్యాన్న దానాలతో పాటు సేవలు, ఆధ్యాత్మిక రంగంలోను ముందు నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గజపతి స్వామి, పోలవరపు అప్పలకొండ, భానోజీరావు, తిత్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



ద్వారకా బస్టాండ్‌లో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మీనాక్షి తదితరులు

డాబాగార్డెన్స్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి. మీనాక్షి నేతృత్వంలో బుధవారం తొమ్మిదవ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ద్వారకా బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేత్రదానం ఆవశ్యకత వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నేత్ర దానం ఎవరు చేయాలి, ఎలా చేయాలో వివరించారు. నేత్రదానంపై ఉన్న అపోహలు తొలగించేలా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఐ డొనేషన్ కౌన్సిలర్లచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని ప్రసాదం కౌంటర్ ప్రారంభం



కౌంటర్ ప్రారంభించి ప్రసాదం కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ప్రసాదం కౌంటర్‌ను నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. పూర్ణామార్కెట్ రోడ్డులో గల సత్యదేవుని ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డు ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌ను వంశీ ప్రారంభించారు. అన్నవరం సత్యదేవుని ఆలయం వలే ప్రసాద కౌంటర్ ఏర్పాటుపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ను కలిసిన వాసుపల్లి



వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేఎస్ విశ్వనాథన్‌ను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ మహానగరానికి జాయింట్ కలెక్టర్‌గా, జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నిజాయితీగా బాధ్యతలు నిర్వహించిన ఆయన ప్రతిష్ఠాత్మకమైన వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు నీతి నిజాయితీ కలిగిన ఇటువంటి అధికారులతో న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవ చేయడంలో విశ్వనాథన్ ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. వీఎంఆర్‌డీఏ మరింత అభివృద్ధి చెందాలని వాసుపల్లి అభిలషించారు.

వినాయక ఉత్సవాలకు శ్రీకారం



రాట మహోత్సవంలో పాల్గొన్న బొడ్డేటి ప్రసాద్, కోరిబిల్లి త్రినాథ్ తదితరులు

అల్లిపురం: వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చిన్నా, పెద్దా ఉత్సాహం చూపిస్తున్నారు. దీంట్లో భాగంగా వెంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో పందిరి రాట కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోరిబిల్లి త్రినాథ్, సూరిశెట్టి శ్రీనివాస్, డీజే బాయ్స్ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఆలయ ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. ముందుగా ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి గణపతి పూజ నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి హారతులు ఇచ్చారు. అమ్మవారి దర్శనానికి, జలాభిషేకానికి ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ విధ్వంసం తగదు



నిరసన తెలుపుతున్న క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ టీం సభ్యులు

డాబాగార్డెన్స్: అభివృద్ధి పేరిట జరిగే పర్యావరణ నాశనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ టీం సభ్యులు హెచ్చరించారు. జిల్లా పరిషత్ శ్రీకృష్ణ చైతన్య మఠం సమీపాన సముద్ర ఆస్పత్రి నిర్మాణం కోసం అనేక చెట్లను అనవసరంగా తొలగించేందుకు ప్రభుత్వం నుంచి ఓ ప్రతిపాదన వచ్చిందన్నారు. చెట్లను కూల్చకుండా వాటిని మరో ప్రాంతానికి మార్చాలని జీవీఎంసీ అధికారులు, ఆస్పత్రి యాజమాన్యాన్ని పలుమార్లు కోరినప్పటికీ వారు పట్టించుకోలేదని బృందం సభ్యులు ఓంద్రిలా, అంజనా, కార్తీక్, రాజేష్, విజ్ఞాన్, వర్షిత్, ఉదయ్, మోహన్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, సమాజ హితం కోరే ప్రతి ఒక్కరూ తమ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

మిజోరం గవర్నర్‌ను కలిసిన నాయకులు



మిజోరం గవర్నర్ హరిబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబును బీజేపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, నగర అధ్యక్షుడు ఎం.రవీంద్రరెడ్డి, నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు తదితరులు హరిబాబును కలిసి జ్ఞాపిక అందజేశారు. అలాగే ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ వాయునందనరావు, కృష్ణ తదితరులు శ్రీరామచంద్రమూర్తి చిత్రపటాన్ని హరిబాబుకు అందజేశారు. ఆయనతో నాయకులు కొంత సేపు ముచ్చటించి స్థానిక పరిస్థితులపై చర్చించారు.

మహిళ అనుమానాస్పద మృతి

డాబాగార్డెన్స్: ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి 36వ వార్డులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 36వ వార్డులో గండిపల్లి దేవి (28) భర్త గండిపల్లి గణేష్‌తో స్థానికంగా నివాసం ఉంటోంది. కుటుంబ కలహాల కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుందో? భర్త వేధింపులు తాళలేక ఆత్మ హత్య చేసుకుందో పోలీసులు విచారిస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఆకట్టుకుంటున్న నల్లనయ్య గేయాలు



నల్లనయ్య గేయాల సీడీని ఆవిష్కరిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖ నగర ప్రజల అవగాహనకు, జీవీఎంసీ శ్రేయస్సుకు పల్లి నల్లనయ్య రచించిన గేయాలు, రచనలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ అభినందించారు. ఇటీవల విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన పల్లి నల్లనయ్యను జీవీఎంసీ కార్యదర్శి విధుల నుంచి విడుదల చేస్తూ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా నల్లనయ్య రచించిన పది గేయాలను నగరానికి చెందిన మాత స్టూడియోస్ అధినేతలు భిన్నాల నరసింహమూర్తి, పల్లి నాగభూషణరావు నిర్మించి తయారు చేసిన సీడీని జీవీఎంసీ కమిషనర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ పాటలు జీవీఎంసీ శ్రేయస్సుకు, ప్రజా అవగాహనకు ఎంతో ఉపయోగపడతాయని, కమిషనర్ అభినందించారు.

నల్లనయ్య రచించిన గేయాలు..

నిర్మాతలు బీఎస్ మూర్తి, పల్లి నాగభూషణరావు సహకారంతో పల్లి నల్లనయ్య జీవీఎంసీ మనదే మనదే, జీవీఎంసీ శానిటేషన్ సాంగ్, జీవీఎంసీ రెవెన్యూ సాంగ్, మనకోసమే ఈ జీవీఎంసీ ఉంది, ప్లాస్టిక్ రహిత విశాఖ, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ విశాఖ, సీజనల్ వ్యాధుల నివారణ, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన, పారిశుధ్య సైనికుల పేరిట పలు రచనలు చేశారు.

‘పంజరంలో పక్షి’ పుస్తకావిష్కరణ

- ఘనంగా రచయిత డాక్టర్ రాచకొండ నరసింహాశర్మ 101వ జన్మదినోత్సవం



రాచకొండ నరసింహశర్మను సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: ప్రముఖ కవి, అనువాదకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ 101వ జన్మదినోత్సవం, ఆయన రచించిన అనువాద కవితా సంపుటి ‘పంజరంలో పక్షి’ పుస్తకావిష్కరణ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. సహృదయ సాహితి, ప్రసన్నభారతి సంయుక్త నిర్వహణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వందేళ్ల వయసులోనూ రాచకొండ నరసింహాశర్మకు తెలుగు భాషపై మక్కువ తగ్గలేదన్నారు. 62 ఏళ్లుగా సాగిస్తున్న ఆయన సాహితీ ప్రస్థానాన్ని కొనియాడారు. 101వ సంవత్సరంలో అడుగిడిన రాచకొండను వివిధ సాహితీసంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ప్రసన్న భారతి సంపాదకులు కొండేపూడి సర్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో సాహితీ వేత్తలు డాక్టర్ జి. రఘురామారావు, శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి.వేణు, సిహెచ్.చిన సూర్యనారాయణ పాల్గొని రాచకొండ వారి సాహితీ ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో సూరపనేని విజయ్‌కుమార్, ద్విభాష్యం రాజేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనాథకు ఆశ్రయం



పోలయ్యను ఆశ్రమానికి అప్పగిస్తున్న పచ్చిరపల్లి రాము

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో కిలిమి పోలయ్య చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి ఎవరూ లేకపోవటంతో వయసు రీత్యా ఇబ్బందులు పడుతున్నాడు. తినడానికి తిండి లేక, ఏ పనీ చేసుకోలేక అవస్థలకు గురవుతున్నాడు. విషయం తెలుసుకున్న వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అతన్ని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం సెక్రటరీ వాసుకి బుధవారం అప్పగించారు.

సైన్స్ నమూనాలతో సత్తా చాటిన చిన్నారులు



తాము రూపొందించిన సైన్స్ నమూనాలతో విద్యార్థులు

డాబాగార్డెన్స్: కేంద్రంలోని యువజన సర్వీసుల శాఖ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నేషనల్ యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై జిల్లా, రాష్ట్రస్థాయిలో కూడా పోటీలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో బుధవారం యువజన సర్వీసుల శాఖ అవగాహన సదస్సు నిర్వహించింది. విద్యార్థులు సైన్స్ పరిశోధనలకు సంబంధించి పలు మోడళ్లను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి సెట్విస్ సీఈవో దాట్ల కీర్తి, డీఈవో సీహెచ్‌వీఎస్ మూర్తి పాల్గొని తమ అభిప్రాయాల్ని విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ యువత వివేకానందుడి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎ. అర్చన, కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా ఉద్యోగుల టీఏ పునరుద్ధరించాలి

మద్దిలపాలెం: ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు ఈ నెల నుంచి నిలిపివేసిన టీఏ అలవెన్స్‌ను పునరుద్ధరించి, ఎరియర్స్, ఇతర అలవెన్స్‌లు సకాలంలో చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌లో జాయింట్ డైరెక్టర్ పూజారి శ్రీనివాస్ నాయక్‌కు వినతి పత్రం అందించామని తెలిపారు. ఏపీపీటీడీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన అలవెన్స్‌లను అకస్మాత్తుగా నిలిపివేయడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యామని ఆయన పేర్కొన్నారు. రాత్రనకా, పగలనకా 8 నుంచి 16 గంటల పాటు ప్రయాణికులకు సేవలందిస్తున్న ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు అలవెన్స్‌లు కొరత పెట్టి ఇబ్బందులకు గురిచేయడం భావ్యంగా లేదన్నారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ అధ్యక్ష్య కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, ఎం.వి.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొడవ పడ్డ గంజాయి గ్యాంగ్

అల్లిపురం: మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డ మూకలు రోడ్డున పడి గొడవలకు పాల్పడుతున్నారని కొబ్బరితోట వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి కొబ్బరితోటలో కొంత మంది గంజాయి తాగే వ్యక్తుల మధ్య గొడవ చిలికి చిలికి పెద్దదయింది. ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. దీంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేయటంతో వారిని అదుపులోకి తీసుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుమలరావు తెలిపారు.

విద్యుత్ సంసస్కరణలు రద్దు చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన వామపక్ష నేతలు

సీతమ్మధార: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టం-2020ను తక్షణమే రద్దు చేయాలని, రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రతిపాదనను చంద్రబాబు ప్రభుత్వం విరమించుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ గాంధీ పార్కులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిపిన కాల్పుల్లో మృతి చెందిన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మోదీ తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ రాష్ట్రంలో అమలు చేయడం కోసం టీడీపీ ప్రభుత్వం సీరియస్‌గా ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటికే వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించారని అన్నారు. స్మార్ట్ మీటర్లు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో మరో బషీర్‌బాగ్ తరహా ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, జి. అప్పలరాజు, వై.రాజు, గౌరిష్, కుమారి, సీపీఐ నాయకులు మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.